సాక్షి వైఎస్సార్ జిల్లా

గురువారం । 29 । ఫిబ్రవరి । 2024



రంగ రంగా.. వైభవంగా!
పులివెందులలో శ్రీరంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీదేవి, భూదేవీ సమేత శ్రీరంగనాథ స్వామి రథోత్సవం కనుల పండువగా జరిగింది. -8లో



వైఎస్సార్‌సీపీలోకి చేరికలు
టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. బుధవారం వివిధ నియోజకవర్గాల్లో ఆయా నేతల సమక్షంలో పార్టీలో చేరారు. -8లో

గరిష్టం/కనిష్టం
34.4/22.5

వాతావరణం
జిల్లాలో బుధవారం 22.5 - 34.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రబీ పంటల కొనుగోలుకు సిద్ధం

కడప అగ్రికల్చర్: జిల్లాలో రబీ 2023–24లో సాగు చేసిన శనగ, మినుము, పెసర, వేరుశనగ పంటలను మద్దతు ధరపై కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధగా ఉందని మార్క్‌ఫెడ్ మేనేజర్ తాడిగుట్ల. నరసింహారెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన చెప్పారు.

రెండోరోజు కొనసాగిన టెట్



కడపలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏపీటెట్ జిల్లా అబ్జర్వర్ వెంకటకృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: ఏపీ టీచర్ ఎలిజిబిలిటి టెస్టు(ఏపీటెట్–2024) కంప్యూటర్ బేస్డ్ పరీక్ష జిల్లావ్యాప్తంగా కేటాయించిన కేంద్రాల్లో బుధవారం రెండో రోజు ప్రశాంతంగా జరిగింది. నిర్ణీత సమయానికి కంటే ముందుగానే విద్యార్థులు కేంద్రాలకు చేరుకున్నారు. మార్చి 6వ తేదీ వరకు ఏపీటెట్ జరగనుంది. రెండోరోజు ఉదయం సెషన్‌లో కడపలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో, పొద్దుటూరులోని రెండు పరీక్షా కేంద్రాల్లో 860 మంది విద్యార్థులకు 774 మంది హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం సెషన్‌లో కడప, పొద్దుటూరులోని ఆరు పరీక్షా కేంద్రాల్లో 862 మందికి 791 మంది హాజరయ్యారు. కడపలోని కేఎస్‌ఆర్ఎం, కేటిఆర్ఎం, అన్నమాచార్య పరీక్ష కేంద్రాలను ఏపీటెట్ జిల్లా అబ్జర్వర్ వెంకటకృష్ణారెడ్డి తనిఖీ చేశారు.

మాతృ మరణాలపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న ఓఎస్‌డీ రఘునాథ్

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో మాతృ మరణాలపై కలెక్టరేట్ ఓఎస్డీ రఘునాథ్ సమీక్ష నిర్వహించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ సూచన మేరకు జిల్లాలోని కామనూరు, కల్లూరు, కలసపాడు, దువ్వూరు, వనిపెంట ప్రాథమిక కేంద్రాలకు సంబంధించి గతంలో సంభవించిన మాతృమరణాలపై సమీక్షించారు. మాతృ మరణాలకు గల కారణాలను సంబంధిత పీహెచ్‌సీ వైద్యులు, ఉన్నత ఆసుపత్రుల స్పెషలిస్ట్ వైద్యులు, ప్రైవేట్ నర్సింగ్ హోం వైద్యులతో చర్చించారు. ఆయా ఆసుపత్రుల యందు అందించిన సేవల గురించి ఆరా తీశారు. డీసీహెచ్ఎస్ ద్వారా జరుగుతున్న రెఫరల్స్ గురించి విచారణ చేయాలని తెలిపారు. జిల్లాలో మాతృ మరణాలు జరగకుండా అన్ని స్థాయిల్లో సరైన సేవలు అందించాలని, మారుమూల గ్రామంలో కూడా మాతృ మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలన్నారు.ఇన్‌చార్జి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఉమా మహేశ్వర కుమార్, డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమాదేవి, స్త్రీల వ్యాధి నిపుణుల విభాగాధిపతి డాక్టర్ లక్ష్మి సుశీల, డాక్టర్ రమాదేవి, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టెట్ అభ్యర్థులకు శిక్షణ

రాయచోటి టౌన్: టెట్ (టీచర్ ఎలిజిబిలి టెస్టు) రాస్తున్న అభ్యర్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా రాయచోటి శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల, రాజంపేటలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల, మదనపల్లెలోని విశ్వం ఇంజినీరింగ్ కళాశాల, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో టీటీసీ, బీఈడి పూర్తి చేసిన అభ్యర్థుల కోసం ఈ నెల 27వ తేదీ నుంచి మార్చి 6 వరకు అవగాహన కల్పించడంతో పాటు శిక్షణ ఇస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం రాయచోటిలో ఉదయం సెషన్‌కు 350 మందికి 298 మంది, మధ్యాహ్నం సేషన్‌కు 348 మందికి 303 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

కొత్త పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో కొత్త పరిశ్రమల స్థాపన కోసం ముందుకు వచ్చే ఔత్సాహికులకు మరింత ప్రోత్సాహం అందించాలని కలెక్టర్ విజయరామరాజు డీఐఈపీసీ సభ్యులను ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో నిర్వహించిన జిల్లా పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేయాలన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందన్నారు. కొత్తగా పారిశ్రామికరంగంలోకి వచ్చే వారికి ఆర్థిక ప్రోత్సాహం అందించాలని బ్యాంకర్లను కోరారు. పారిశ్రామిక అభివృద్ధి పాలసీ 2020–23 ప్రకారం వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం ద్వారా ఎస్సీ ఎస్టీ కేటగిరీకి సంబంధించిన పది యూనిట్లకు రూ. 79.90 లక్షలు, వడ్డీ రాయితీకి సంబంధించిన మూడు యూనిట్లకు రూ. 8.20 లక్షలు చొప్పున మొత్తం 13 యూనిట్లకు రూ. 88.01 లక్షల రాయితీ విడుదలకు కమిటీ ఆమోదం తెలిపింది.

రైతుకు వరం..చీనీ పెంపకం

- జిల్లా వ్యాప్తంగా రూ.6.75 కోట్లు వెచ్చింపు
- 1,866 మంది రైతులు 2,480 ఎకరాల్లో చీనీతోటలు సాగు
- ఉపాధి హామీ పథకంలో లాభాలు పొందుతున్న కర్షకులు
- జాబ్ కార్డు ద్వారా 100 రోజుల పని దినాలు





ఉపాధి హామీ పథకంలో భాగంగా సాగులో ఉన్న చీనీ తోట

సాక్షి ప్రతినిధి, కడప : వాతావరణ విపత్తులతో ఆర్థికంగా సతమతమవుతున్న రైతాంగానికి ఉపాధి హామీ పథకం వరంగా నిలుస్తోంది. ఉద్యాన పంటల సాగుకు అందిస్తోన్న ప్రోత్సాహం కొండంత బలాన్ని ఇస్తోంది. ప్రధానంగా చీనీతోటల సాగు సత్ఫలితాలు ఇస్తోంది. సన్న, చిన్న కారు రైతు కుటుంబాల ఆర్థిక ఎదుగుదలకు తోడ్పాటు ఇస్తూ మరింత మందికి ఉపాధి దక్కుతోంది. జిల్లా వ్యాప్తంగా రూ.6.75 కోట్లను ప్రభుత్వం వెచ్చించి, రైతులకు తోడ్పాటుగా నిలుస్తోంది.

ఉపాధి హామీ పథకం ద్వారా..

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు కలిగిన ప్రతి గ్రామీణ కుటుంబానికి ఒక ఆర్థిక సంవత్సరంలో 100 రోజుల పని కల్పిస్తున్నారు. వ్యక్తిగత, ఉమ్మడి ఆస్తుల ఏర్పాటులో భాగంగా చేపట్టిన పనులు కేటగిరి ×బ్జికి సంబంధించి వ్యవసాయ పనులకు అనుసంధానం చేశారు. ఈ పనుల్లో భాగంగా 5 ఎకరాల లోపు భూమి కలిగిన రైతులకు చీనీ చెట్ల ద్వారా సుస్థిర ఆదాయ మార్గాల వైపు దృష్టి పెట్టారు. తద్వారా ఆయా రైతుల జీవనోపాధి పొందుటకు ఉపయోగంలోకి తెచ్చారు.



లాభాల బాటలో..

2019–20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద 1,866 మంది రైతులు 2,480 ఎకరాల్లో చీనీ తోటలు సాగు చేస్తున్నారు. చీనీ తోటలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అందిస్తున్న ఉపాధి పనులు, రాయితీలు రైతులకు మరింత లాభదాయకంగా నిలుస్తున్నాయి. గ్రామీణ రైతులు, రైతు కూలీలు ఉపాధి హామీ పథకంలో అనుసంధానం చేసిన చీనీ సాగుకు మొగ్గు చూపుతూ.. ఉన్న ఊరిలోనే చక్కటి ఉపాధి అవకాశాలు పొందుతున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహంతో రైతు ముందంజ

ఎర్రగుంట్ల మండలం తిప్పలూరు గ్రామానికి చెందిన జాబ్ కార్డు హోల్డర్ పేర్ల బాల సుబ్బారెడ్డి చీనీ తోట సాగు ద్వారా ఉపాధి పొందుతూ ముందడుగు వేస్తున్నారు. అతి తక్కువ పెట్టుబడి, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ, ఆర్థిక సహకారంతో తనకున్న 3.98 ఎకరాల పొలంలో చీనీ చెట్లు సాగు చేసి మెరుగైన జీవనోపాధి పొందుతున్నారు. 2019–20 ఆర్థిక సంవత్సరంలో 3.98 ఎకరాలకు చీనీ చెట్లు సాగు చేసేందుకు రూ.4,73,588 అంచనా వేశారు. జాబ్ కార్డు ద్వారా 254 రోజులు పనిదినాలు కల్పించి రూ.1,36,183 ఖర్చు వెచ్చించారు. అంతకు మునుపు వేరుశనగ, నూగు, వరి లాంటివి సాగు చేసే వారు. ప్రస్తుతం మంచి లాభాలు గడిస్తున్నారు. పేర్ల బాలసుబ్బారెడ్డి తన భూమిలో 398 చీనీ మొక్కలను నాటి వర్మీ కంపోస్టు, సేంద్రియ ఎరువులు వాడడం వల్ల అధిక దిగుబడి సాధించారు. ఇప్పటికి రూ.7,78,000 ఆదాయం కూడా చేకూరినట్లు బాలసుబ్బారెడ్డి వెల్లడిస్తున్నారు.

ఆసక్తి ఉన్న వారికి అవకాశం కల్పిస్తాం



ఉపాధి హామీ పథకం ఉద్దేశం ప్రకారం పని కోరిన వారికి పని కల్పించనున్నాం. జిల్లాలో ఈ పథకం ద్వారా 2,480 ఎకరాల్లో చీనీ తోటలు సాగులోకి తెచ్చాం. ఎర్రగుంట్ల మండలం తిప్పలూరు గ్రామానికి చెందిన జాబ్ కార్డుదారుడు పేర్ల బాలసుబ్బారెడ్డి ఈ పథకాన్ని చక్కగా సద్వినియోగం చేసుకున్నారు. ఇప్పటి వరకు 255 పనిదినాలు కల్పించి రూ.1,36,183 వేతనాలు చెల్లించాం. అర్హులైన రైతులకు అవకాశం కల్పించనున్నాం.
– యధుభూషణరెడ్డి, పీడీ, డ్వామా

తక్కువ ఖర్చుతో అధిక లాభాలు



ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేసిన చీనీ చెట్ల పంటలను సాగు చేసుకొని తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చు. ఉపాధి హామీ పథకం ద్వారా చీనీ తోటపెంపకం చేపట్టిన రైతులు గణనీయంగా ఆదాయం గడిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,866 మంది రైతులు మాత్రమే సద్వినియోగం చేసుకున్నారు. మెట్ట ప్రాంత రైతులకు ఈ పథకం వరంగా నిలవనుంది. అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలి.
– విజయరామరాజు, కలెక్టర్

గంగజాతరకు పక్కాగా ఏర్పాట్లు చేయాలి

లక్కిరెడ్డిపల్లి: మార్చి 11,12వ తేదీల్లో జరిగే గంగమ్మజాతరకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఆర్డీఓ రంగస్వామి పేర్కొన్నారు. బుధవారం స్థానిక గంగమ్మ దేవత ఆలయంలో అన్నిశాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ గంగమ్మ జాతరకు లక్షల సంఖ్యలో భక్తులు వస్తారని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. జాతర ముగిసేవరకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని విద్యుత్ శాఖాధికారులకు సూచించారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. జాతరలో అక్రమ మద్యం, నాటుసారా విక్రయాలు జరగకుండా చూడాలని ఎక్సైజ్ సిబ్బందికి సూచించారు. జాతరలో భాగంగా చాందినీ బండ్ల ఊరేగింపులలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఎద్దుల పరష ప్రారంభం



రూ.2 లక్షలు పలికిన ఎద్దులు

మదనపల్లె సిటీ: అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం సీటీఎం నలవీరగంగాభవానీ జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఎద్దుల పరష ప్రారంభమైంది. ఆలయం సమీపంలోని మైదానంలో పరషను సర్పంచ్ ఆనందపార్థసారధి ప్రారంభించారు. పరషకు మదనపల్లె, వాల్మీకిపురం, తంబళ్లపల్లె, పీలేరు, కురబలకోట ప్రాంతాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో ఎద్దులను తీసుకువచ్చారు. రైతులు ఎద్దుల కొనుగోలు చేశారు. శానిటోరియంకు చెందిన ఓ రైతు రూ. రెండు లక్షలు విలువ చేసే ఎద్దులను కొనుగోలు చేశారు.దీంతో పాటు రెండు జతల ఎద్దులు రూ.1.60 లక్షలు పలికింది. లక్షలు పెట్టి రైతులు ఎద్దులను కొనుగోలు చేశారు. ఈ ఎద్దుల పరష మార్చి 3 వరకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం దోపు తిరునాల నిర్వహించారు.

'వికసిత్ భారత్' లక్ష్యంగా శాస్త్ర పరిశోధనలు

జాతీయ సైన్స్ దినోత్సవంలో వీసీ ఆచార్య చింతా సుధాకర్



సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

వైవీయూ: అత్యాధునిక శాస్త్ర పరిశోధనలతో ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా నిలిచి భవిష్యత్తులో వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకుంటుందని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం యోగి వేమన విశ్వవిద్యాలయంలో జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని సర్ సీవీ రామన్ చిత్రపటానికి అతిథులు, అధికారులు పూలమాలలు వేశారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీసీ మాట్లాడుతూ ఈ ఏడాది జాతీయ సైన్స్ దినోత్సవం థీమ్ 'వికసిత్ భారత్ కోసం స్వదేశీ సాంకేతికతలు'గా నిర్ణయించారన్నారు. సైన్స్, టెక్నాలజీ ఇన్నోవేషన్‌ల పట్ల ప్రజల ప్రశంసలను ప్రోత్సహించడంలో వ్యూహాత్మక దృష్టిని ప్రతిబింబిస్తుందన్నారు. ప్రజాశ్రేయస్సు కోసం స్వదేశీ సాంకేతికతల ద్వారా సవాళ్లను పరిష్కరించడానికి భారతీయ శాస్త్రవేత్తలు విజయాలు సాధించారన్నారు. సైన్స్ ద్వారా దేశాన్ని ఆత్మనిర్భర్‌గా మార్చడమే పరిశోధకుల లక్ష్యం కావాలన్నారు. ప్రపంచ గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్ (జీఐఐ)లో 2015 సంవత్సరం 81 ర్యాంకులో ఉన్న భారతదేశం నేడు 40వ స్థానంలో ఉండడం సంతోషదాయకమన్నారు.పేటెంట్ ఫైలింగ్ 90,000 దాటిందని, ఇది రెండు దశాబ్దాలలో అత్యధికమైన నమోదుగా అభివర్ణించారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య పొదిలి అప్పారావు 'భారతదేశంలో విజ్ఞాన, పర్యావరణ శాస్త్రాల పురోగ'అన్న అంశంపై కీలకోపన్యాసం చేశారు. సైన్స్‌తో ప్రపంచమంతా ప్రయోజనం పొందుతోందన్నారు. విద్యార్థులలో శాస్త్రీయ ప్రేరణతోనే విజ్ఞాన శాస్త్ర ప్రగతి ఉంటుందన్నారు. వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ సర్ సీవీ రామన్ 'రామన్ ఎఫెక్ట్'ని కనుగొన్న సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం ప్రతి ఏటా ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ డే నిర్వహిస్తామన్నారు. చీకటి నుంచి వెలుగుల యుగంలోకి తెచ్చేవారు శాస్త్రవేత్తలన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథ రెడ్డి మాట్లాడుతూ సైంటిస్టుల వల్లనే ఇవాళ అన్ని సౌకర్యాలు పొందగలుగుతున్నామన్నారు. చెన్నై ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసర్ రమేష్ లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య పి.ఎస్. షావలీఖాన్, సైన్స్ ఫ్యాకల్టీ డీన్ ఆచార్య కె. కృష్ణా రెడ్డి మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త వెంకట్రామిరెడ్డి, అధ్యాపకులు ఆచార్య ఎ. చంద్ర శేఖర్, ఆచార్య ఎల్.మాధవి, డాక్టర్ ఎం. మమతకుమారి అతిథులను సభకు పరిచయం చేశారు. అనంతరం ముఖ్య వక్తలకు సన్మానం చేశారు. సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు.

ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నా



హాజరైన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ వి సతీష్‌కుమార్‌రెడ్డి

- మాజీ ఎమ్మెల్సీ ఎస్‌వి సతీష్‌కుమార్‌రెడ్డి
- కార్యకర్తలందరూ వెంటరావాలని పిలుపు

వేంపల్లె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆహ్వానం మేరకు వైఎస్సార్ సీపీలో చేరుతున్నానని శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మెన్ ఎస్‌వి సతీష్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్ ఉర్దూగర్ షాదీఖానాలో కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకోసం ప్రాణాలు తెగించి పోరాడినా చంద్రబాబు నన్ను నమ్మలేదన్నారు. నేను ఎవరితో పోరాటం చేశానో అలాంటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు స్నేహ హస్తం అందించారని, అందువల్ల ఆయన ఆహ్వానం మేరకు త్వరలో వైఎస్సార్ సీపీ పార్టీలో చేరుతున్నట్లు సతీష్‌కుమార్‌రెడ్డి చెప్పారు. అందుకోసం కార్యకర్తలందరూ తన వెంటరావాలని పిలుపునిచ్చారు. నాలుగేళ్లుగా రాజకీయాలకు దూరంగా ఉండటంతో మళ్లీ రాజకీయాలో క్రియాశీలకంగా వ్యవహరించాలని నాయకులు, అభిమానులు కోరారని తెలియజేశారు. నేను 2020 వరకు టీడీపీకి విశేష సేవలందించానని పేర్కొన్నారు. అయినా పార్టీ నన్ను పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేషులు నేను కొందరితో లాలూచి పడ్డానని అవమానించారు. ఇంత అవమానించిన తర్వాత టీడీపీలో ఉండటం సరికాదనే ఆ రోజు రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు. టీడీపీలో నాతోపాటు తిరిగిన నాయకులు పార్టీలో నా రాజకీయ భవిష్యత్తుపై అడిగినా చంద్రబాబు నాయుడు పట్టించుకోలేదన్నారు. నాలుగురోజుల నుంచి పరిస్థితులు మారినట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీ నేతలను నా వద్దకు పంపించి పార్టీలోకి ఆహ్వానం పంపిన తరువాత టీడీపీ అగ్రనేతలు తన ఇంటికి పార్టీ నాయకులను పంపించారన్నారు. నాలుగేళ్లుగా పార్టీకి దూరంగా ఉన్న పట్టని టీడీపీ అధ్యక్షుడికి ఎన్నికలు సమీపిస్తుండటంతో వారికి తాను గుర్తుకొచ్చానా అని ప్రశ్నించినట్లు తెలియపరించారు. రాబోయే కాలంలో ఏ రకంగా అయితే తెలుగుదేశం పార్టీకి సేవ చేశానో అదే స్ఫూర్తితో అదే కట్టుబాటుతో వైఎస్సార్ సీపీ అభివృద్ధి కోసం పనిచేస్తానని చెప్పారు. వేంపల్లె గ్రామంలో సీఎం వైఎస్ జగన్ సహకారంతో సుందరీకరణ పనులు చేస్తున్నట్లు వివరించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన తర్వాత సీఎం వైఎస్ జగన్ ఆదేశిస్తే జిల్లాలో టీడీపీపై అసంతృప్తితో ఉన్న వారిని పార్టీలో చేర్పించేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో సతీష్ కుమార్‌రెడ్డి కుమారులు రోహన్ నాగిరెడ్డి, తుషార్ నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డితోపాటు హేమాద్రి, పెద్ద ఎత్తున నాయకులు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- జిల్లాలో 2,10,625 మందికి రూ.42.29 కోట్ల రైతు భరోసా సాయం
- 41,828 మందికి రూ. 10.547 కోట్ల సున్నా వడ్డీ రాయితీ



రైతులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ విజయరామరాజు తదితరులు

కడప సెవెన్‌రోడ్స్: రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, ఇందులో భాగంగానే పీఎం కిసాన్ వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తోందని కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బుధవారం పీఎం కిసాన్ వైఎస్సార్ రైతు భరోసా ఐదో ఏడాది మూడో విడత ఆర్థికసాయంతోపాటు రబీ 2021–22, ఖరీఫ్ 2022కు సంబంధించిన సున్నా వడ్డీ పంట రుణాల రాయితీ మొత్తాన్ని బటన్ నొక్కి రైతుల ఖాతాలకు నేరుగా బదిలీ చేశారు. కలెక్టరేట్ నుంచి వీసీ ద్వారా అధికారులు పాల్గొన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ జిల్లాలోని 2,10,625 మంది రైతులకు రూ. 42,29,21,000తోపాటు 41,828మంది రైతులకు రూ. 10,54,76,311ల సున్నా వడ్డీ రాయితీ మొత్తాన్ని మెగా చెక్కు రూపంలో అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతుభరోసా వల్ల వ్యవసాయంపై రైతుల్లో మక్కువ పెరిగిందన్నారు. దేశంలోనే తొలిసారిగా కౌలు రైతులతో పాటు దేవ దాయ, అటవీ భూములు సాగు చేసుకుంటున్న వాస్తవ సాగు దారులకు కూడా ప్రభుత్వం ఈ పథకాన్ని వర్తింపజేస్తోందన్నారు. అర్హత కలిగి రైతు భరోసా పథకం పొందని వారు ఎవరైనా ఉంటేవార్డు, గ్రామ వలంటీర్లు, సచివాలయ అగ్రికల్చర్ అ సిస్టెంట్లు, మండల వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు.జేసీ గణేష్‌కుమార్, వ్య వసాయ సలహా మండలి చైర్మన్ ఓబుల కొండా రెడ్డి,వ్యవసాయాధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జీవావరణాన్ని మెరుగు పరచాలి

సహజ పద్ధతుల ద్వారా గ్రామీణ జీవావరణాన్ని మెరుగు పరచాలని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో జీవ వైవిధ్యం – ఉమ్మడి వనరుల అభివృద్ధి, సుస్థిర భూ వనరుల యాజమాన్యం అనే ప్రాజెక్టు ద్వారా సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని బి.కోడూరు మండలం రేకుల కుంటలో 1670 హెక్టార్లలో సహజ పద్ధతుల ద్వారా వివిధ జీవావరణాలను అభివృద్ధి పరిచి సుస్థిర అభివృద్ధి భూ యాజమాన్యాన్ని నిర్వహించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు.

- రానున్న సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల నియమావళిని తూచా తప్పక పాటించి సహకారం అందించాలని కలెక్టర్ విజయరామరాజు రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని స్పందన హాలులో ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సీజ్ చేసే డబ్బులను సీజర్ యాప్ ద్వారా మోనిటరింగ్ చేస్తామని తెలిపారు. జిల్లాలో 13 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు నిబంధనల మేరకు బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. రాజకీయ పార్టీలన్నీ క్యాంపెనింగ్ సంబంధించి ముందస్తు అనుమతి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు శ్రీనివాసులురెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, మహాజనరాజ్యం పార్టీ నాయకుడు సంగటి మనోహర్, అమీన్‌పీరా, అవ్వారు మల్లికార్జున, బీజేపీ నాయకుడు శశిభూషణ్‌రెడ్డి, బీఎస్పీ నాయకులు కానుగ దానం, గుర్రప్ప, జిల్లా నోడల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలి

కడప సెవెన్‌రోడ్స్: మహాశివరాత్రి పర్వదిన మహోత్సవాల ఏర్పాట్లను పటిష్టంగా నిర్వహించి ఉత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో మహాశివరాత్రి సందర్భంగా మార్చి 7 నుంచి 9వ తేదీ వరకు జిల్లాలోని అన్ని ప్రముఖ శైవక్షేత్రాల్లో మహాశివ రాత్రి ఉత్సవ నిర్వహణ ఏర్పాట్లపై ఎస్పీ సిద్దార్థ్ కౌశల్‌తోపాటు ఇతర అధికారులతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రధానంగా పెండ్లిమర్రి మండలంలోని పొలతల శ్రీ మల్లీశ్వర స్వామి దేవస్థానం, సిద్ధవటం మండలం వొంతాటిపల్లిలోని శ్రీ నిత్యపూజ స్వామి దేవస్థానం, ప్రొద్దుటూరు మండలంలోని శ్రీ అగస్తేశ్వర స్వామి దేవాలయం, జమ్మలమడుగు మండలంలోని కన్య తీర్థంలో గల శ్రీ ఈశ్వర స్వామి దేవాలయం తదితర శైవక్షేత్రాలకు లక్షలాది సంఖ్యలో భక్తులు హాజరవుతారని, వారందరికీ ఎలాంటి లోటుపాట్లు, ఇబ్బందులు లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ మాట్లాడుతూ మహా శివరాత్రి పండుగ సందర్భంగా అన్ని శైవక్షేత్రాల్లో పోలీసు బందోబస్తు ఉండేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం శ్రీమద్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణకు సంబంధించిన పోస్టర్లను అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.

క్లుప్తంగా

వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ముద్దనూరు : మండలంలోని కొత్తపల్లె గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని మతిస్థిమితం లేని ఓ వ్యక్తి(55) దుర్మరణం చెందాడు. సీఐ దస్తగిరి సమాచారం మేరకు మంగళవారం అర్ధరాత్రి సమయంలో కొత్తపల్లె వద్ద వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే అతడు మరణించాడు. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గోపవరం : మండలంలోని పి.పి.కుంట సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో బుధవారం బద్వేలు రూరల్ ఎస్ఐ రవి కుమార్, సిబ్బంది దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1,33,600లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

కొండాపురం : మండల కేంద్రంలోని కొండాపురం నూతన బైపాస్ రోడ్డులో ఈనెల 25 వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదం సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యోగీంద్ర తెలిపారు. ఆయన కథనం మేరకు.. కొండాపురం గ్రామానికి చెందిన తిప్పిరిపాటి చార్లెస్ బాబు అతని కూతురు తిప్పిరిపాటి జాన్విక ద్విచక్ర వాహనంలో చౌటిపల్లె నుంచి వస్తుండగా నూతన బైపాస్ రోడ్డులో కొండాపురం వద్ద కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు

ఉపాధ్యాయుని ఇంట్లో చోరీ

కడప అర్బన్ : కడప నగరం ఎన్జీఓ కాలనీలో ఓ ఉపాధ్యాయుని ఇంటిలో చోరీ జరిగిందని చిన్నచౌక్ పోలీసులు తెలిపారు. ఎన్జీఓ కాలనీకి చెందిన సురేష్, అతని భార్య ఇరువురు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. మంగళవారం వారివురు డ్యూటీకి వెళ్లి వచ్చారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి వెళ్లి 10 తులాల బంగారు ఆభరణాలు అపహరించినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

టిప్పర్ ఢీకొని చిన్నారికి గాయాలు

వల్లూరు : మండల పరిధిలోని కొత్త గాలివారిపల్లె సమీపంలో బుధవారం టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో సుమారు నాలుగు సంవత్సరాల వయసు గల వీర లఖిత గాయపడింది. గ్రామానికి చెందిన సునీల్, వెంకట సుబ్బమ్మల కుమార్తె వీర లిఖిత గ్రామంలో రోడ్డు దాటుతుండగా వల్లూరు వైపు నుండి ఆదినిమ్మాయపల్లె వైపు వెళుతున్న టిప్పర్ ఢీకొంది. దీంతో చిన్నారి కాలు విరగడంతో పాటు గాయపడింది. స్థానికులు సమాచారం ఇవ్వడంతో కమలాపురం 108 వాహన సిబ్బంది దస్తగిరి, సిద్దయ్య సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్స అనంతరం చిన్నారిని కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కాగా సమాచారం అందుకున్న ఎస్ఐ వెంకట రమణ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

బ్రౌన్ గ్రంథాలయ నిర్మాణంతో డాక్టర్ జానమద్దికి విశేష ఖ్యాతి

కడప కల్చరల్ : మొండిగోడలుగా ఉన్న బ్రౌన్ బంగ్లా శిథిలాలపై అద్భుతమైన జ్ఞాన సౌధాన్ని నిర్మింపజేసిన డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి చిర కీర్తిని సంపాదించారని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. బుధవారం యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆ కేంద్రం నిర్మాత డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి దశమ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత అతిథులంతా కలిసి ప్రాంగణంలోని డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వైవీయూ వీసీ మాట్లాడుతూ బ్రౌన్ గ్రంథాలయం నిర్మాణం వెనుక హనుమచ్ఛాస్త్రి కృషి ఎంతో ఉందన్నారు. భవన నిర్మాణంతో పాటు నిధులు, పుస్తక సేకరణ కోసం అనేక ప్రాంతాలు తిరిగి, అనేకమంది ప్రముఖులను కలిసి గ్రంథాలయ అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లేందుకు యోగి వేమన విశ్వవిద్యాలయం సహకారం అందిస్తుందన్నారు. విశిష్ట అతిథి, వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వైపీ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ డాక్టర్ జానమద్ది సాహితీ సేవకుడుగా, గ్రంథాలయ రూపశిల్పిగా బహుముఖ సేవలు అందించారని కొనియాడారు. యోగివేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యుడు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి జానమద్దితో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన వక్తగా విచ్చేసిన అవధానకవి డాక్టర్ నరాల రామారెడ్డి 'అవధాన వైభవం' అనే అంశంపై ప్రసంగించారు. పద్యం తెలుగుభాషకు మాత్రమే దక్కిన వరమని, ఈ కోవలోనే అవధాన ప్రక్రియ కూడా తెలుగువారికే సొంతమని తెలుపుతూ సోదాహరణంగా అవధానం విశేషాలను వివరించారు.



డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

రా.రా. జయంతి సందర్భంగా..

ఇదే సందర్భంగా రచయిత రాచమల్లు రామచంద్రారెడ్డి జయంతిని కూడా నిర్వహించారు. ప్రభుత్వ పురుషుల కళాశాల అధ్యాపకుడు డాక్టర్ హజరతయ్య 'సృజనాత్మక రచయితగా రారా' అనే అంశంపై ప్రసంగించారు. వేదికపై ఉన్న అతిథులను, బ్రౌన్ పరిశోధన కేంద్రం గ్రంథాలయ సహాయకులు ఎస్.రమేశ్‌రావు, హరిభూషణరావులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి సభను పర్యవేక్షించారు. కార్యక్రమంలో యోగివేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యాపకులు ఆచార్యులు పి.రమాదేవి, ఆచార్య జి.పార్వతి, అలపర్తి పిచ్చయ్య చౌదరి, పుత్తా పుల్లారెడ్డి, బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకట రమణ, ఎం.మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్తోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

అమ్మఒడి మాకెంతో ఆసరా



మాది కాశినాయన మండలం కె.ఎస్.కొట్టాల గ్రామం. నా భర్త వ్యవసాయ పనులు చేస్తుంటాడు. మాకు ఇద్దరు పిల్లలు. ఒకరు 5వ తరగతి, మరొకరు 3వ తరగతి చదువుతున్నారు. నా భర్త సంపాదనతోనే మా కుటుంబం గడవాలి. పిల్లల పోషణ, చదివించడం మాకు ఇబ్బందిగా ఉండేది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి కింద తల్లుల ఖాతాలో జమ చేస్తున్న రూ.15 వేలు మమ్మల్ని ఆదుకుంటోంది. ఈ సొమ్ము మాకు ఆసరాగా మారింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ఈ పథకం మాకు అండగా ఉండటంతో పిల్లలను బాగా చదివించుకుంటున్నాం. ఇప్పటికి మాకు మూడు దఫాలు అమ్మఒడి సాయం అందింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– దాదిబత్తిన నాగమ్మ, కె.ఎస్.కొట్టాల, కాశినాయన మండలం

సొంతింటి కల నెరవేరింది



మేము అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం, అనంతంపల్లి గ్రామంలో నివాసం ఉంటున్నాము. అనంతంపల్లి జగనన్న కాలనీలో మాకు పక్కా గృహం మంజూరు చేశారు. జగనన్న ఇచ్చిన నగదుతోపాటు కష్టాన్ని జతజేసి ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. అలాగే ప్రతినెల ఒకటో తేదీన నాకు రూ. 3 వేలు మా గ్రామ వలంటీర్ తెల్లవారకముందే ఇంటికి తెచ్చి ఇస్తున్నాడు. రేషన్ బియ్యం ఉచితంగా ప్రభుత్వం ఇస్తుంది. మా గ్రామానికి 104 ద్వారా వైద్య సేవలు కూడా అందుతున్నాయి. మేము కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాము. ఈ ప్రభుత్వం సాయంతో సంతోషంగా జీవించగలుగుతున్నాము. మరలా జగనన్న సీఎం అయితే మాలాంటి పేద వారి బతుకులు ఆనందంగా సాగుతాయి.

– తిరుమల రెడ్డి, లక్ష్మీదేవి దంపతులు

దాడి చేయలేదని ముక్తియార్ ప్రమాణం చేస్తాడా

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సవాల్

ప్రొద్దుటూరు : తమ పార్టీ సానుభూతిపరుడైన అమీర్ హంజాపై దాడి చేయలేదని టీడీపీ నాయకుడు వీఎస్ ముక్తియార్ ఖురాన్ మీద ప్రమాణం చేసి చెప్పగలడా అని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సవాల్ విసిరారు. ఉద్దేశ పూర్వకంగా తమపై తప్పుడు కేసులు పెట్టారని చేసిన విమర్శలపై ఎమ్మెల్యే ఘాటుగా స్పందించారు. ఉద్దేశ పూర్వకంగా కేసు పెట్టి ఉంటే తమ పార్టీ అధికారంలో ఉన్న ఐదేళ్లల్లో ముక్తియార్‌తోపాటు టీడీపీ నాయకులైన ఈవీ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డిలపై ఒక్క కేసు అయినా నమోదైందా అని ప్రశ్నించారు. మినర్వా టైర్స్ కుటుంబీకులు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు కాదని, తమ పార్టీ సానుభూతిపరులని తెలిపారు. మినర్వా టైర్స్ యజమాని అమీర్ హంజాను రెండు రోజుల క్రితం రాత్రి స్థల వివాదానికి సంబంధించి అన్నా క్యాంటీన్‌కు పిలిపించి ముక్తియార్‌తోపాటు పక్కన ఉన్న వారందరూ సామూహికంగా దాడి చేయడం, దూషించడం భయభ్రాంతులకు గురి చేయడం జరిగిందన్నారు. అతని కారు, డాక్యుమెంట్లు లాక్కున్నారన్నారు. ఊరిలో తాను తప్ప మరో మైనారిటీ నాయకుడు ఉండకూడదని ముక్తియార్ హెచ్చరించాడన్నారు. సంఘటన జరిగిన తర్వాత మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా, తన బావమరిది తనకు ఫోన్ చేసి తెలిపారని చెప్పారు. జరిగినది జరిగినట్లు రాసి పోలీసులకు ఫిర్యాదు చేయాలని చెప్పానని తెలిపారు. ఆ ప్రకారంగానే పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. సంఘటన స్థలంలో మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి, సీఎం సురేష్‌నాయుడు సైతం ఉండటంతో పోలీసులు కేసులో వారి పేర్లను కూడా పొందుపరిచారన్నారు. ముక్తియార్‌తోపాటు ఆజాద్, ఖలీల్, దాదాపీర్, డాక్టర్ గౌస్ కుమారుడు రూములోకి పిలిపించి అమీర్ హంజాపై దాడికి పాల్పడ్డారన్నారు.

ముక్తియార్ దాడి చేసినట్లు ఆధారాలున్నాయి

అమీర్ హంజాపై దాడికి పాల్పడలేదని, దూషించలేదని వీఎస్ ముక్తియార్ ఖురాన్‌పై ప్రమాణం చేసి చెప్పగలడా అని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రశ్నించారు. ఆయన దాడి చేసినట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ముక్తియార్ అలా ప్రమాణం చేస్తే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా నామినేషన్ వేయనని పేర్కొన్నారు. అలా ప్రమాణం చేయని ముక్తియార్ ఊరు విడిచి వెళతాడా అని అన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా, మార్కెట్ దాదాపీర్, నన్నేసాహెబ్ పాల్గొన్నారు.

వంద కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



కొండూరు గ్రామంలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె గ్రామ పంచాయతీ అమృతానగర్‌కు చెందిన వంద కుటుంబాలు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. బుధవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పరిపాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా మేలు జరిగిందన్నారు. కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని మహిళలకే సుమారు రూ.250 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా అందించామన్నారు. రూ.70 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. ఈ కారణంగానే మేలు జరిగి ఉంటేనే మళ్లీ ఎన్నికల్లో తమకు ఓటు వేయాలని ధైర్యంగా కోరుతున్నామని తెలిపారు. రామాలయ కమిటీ చైర్మన్ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి రూ.10లక్షలు విరాళం ప్రకటించగా, స్థానిక నాయకుడు పెట్ల సుబ్బయ్య రూ.50వేలు నగదు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. అమృతానగర్‌లో కల్యాణ మండపం నిర్మాణానికి స్థలం గుర్తించామని, సొంత నిధులు రూ.కోటితో కల్యాణ మండపాన్ని నిర్మించి కానుకగా ఇస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ శేఖర్ యాదవ్, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బండారు సూర్యనారాయణ, లక్ష్మీనారాయణరెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకుడు సుధాకర్ మాదిగ పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి

పెండ్లిమర్రి : మండలంలోని కొండూరు గ్రామంలో బుధవారం సాయంత్రం పలువురు ముస్లీం మైనార్టీలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మస్తాన్‌వలీ, పూజారి బాబా ఫకృద్దీన్, హుస్సేన్, సాహెబ్‌పీరాతో పాటు 90 కుటుంబాల వారు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ చంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగిరెడ్డి, రాజారెడ్డి, సుబ్బరామిరెడ్డి, వెంకట శివారెడ్డి, షబ్బీర్, జహీర్, అల్లాబకాష్ పాల్గొన్నారు.

రూ.11లక్షలు విరాళం అందజేసిన ఎమ్మెల్యే

కమలాపురం : కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి రూ.11లక్షలు విరాళం అందజేశారు. స్థానిక అయ్యప్ప ఆలయంలో నూతనంగా నిర్మిస్తున్న మండపానికి ఆర్థిక సాయం చేయాలని కమిటీ సభ్యులు కోరారు. ప్రస్తుతం మండప నిర్మాణం జరుగుతుండటంతో కమిటీ సభ్యులకు రూ.6లక్షలు నగదు అందజేశారు. అలాగే క్రైస్తవులకు స్మశానం లేదని, స్థలం ఇప్పించాలని మండల పాస్టర్లు కోరడంతో తన వంతుగా రూ.5లక్షలు ఆర్థిక సాయం బుధవారం రాత్రి అందజేశారు. కాగా అయ్యప్ప ఆలయంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు శాలువ కప్పి, పూలమాలలతో సత్కరించారు. అలాగే నిస్సీ మినిస్ట్రీస్‌లో పాస్టర్ల సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

పేస్ ఇంటిగ్రేటెడ్ జూనియర్ కాలేజీని ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని మోడంపల్లె బైపాస్ రోడ్డులో నెలకొల్పిన పేస్ ఇంటిగ్రేటెడ్ జూనియర్ కాలేజీ, ఐఐటీ, నీట్ శిక్షణా సంస్థను బుధవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. సంస్థ లక్ష్యాలు, సౌకర్యాల గురించి నిర్వాహకులు ఎమ్మెల్యేకు వివరించారు. నిర్వాహకులు, అధ్యాపకులతో ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యార్థులతో కూడా పలువిషయాలపై ముచ్చటించారు. అనంతరం పేస్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్‌త్యాగి మాట్లాడుతూ ముంబై కేంద్రంగా పేస్ విద్యాసంస్థలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. దేశంలో ఇప్పటి వరకు 35 బ్రాంచ్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తెలంగాణలోని హైదరాబాద్‌లో ఒకటి, ఏపీలో మొట్టమొదటగా ప్రొద్దుటూరులో బ్రాంచ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పేస్ విద్యాసంస్థలను ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు ఎన్నో అత్యుత్తమ ర్యాంకులను సాధించామన్నారు. సంస్థ డైరెక్టర్ డాక్టర్ జిలానిబాషా మాట్లాడుతూ ప్రొద్దుటూరులోని విద్యార్థులు కార్పొరేట్ విద్యకోసం బయటి ప్రాంతాలకు వెళ్లలేక 10వ తరగతి తర్వాత చదువులను ఆపాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఇలాంటి విద్యార్థుల కోసం దేశంలోనే అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలు కలిగిన పేస్ విద్యాసంస్థలను ప్రొద్దుటూరులో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. మరో డైరెక్టర్ డాక్టర్ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉండేలా అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్యను అందిస్తూ ఉత్తమ ఫలితాలను సాధించడమే పేస్ సంస్థ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు పాతకోట బంగారు మునిరెడ్డి, ఆయిల్‌మిల్ ఖాజా, టౌన్ బ్యాంక్ ఉపాధ్యక్షుడు అక్రం, మహ్మద్‌గౌస్, షాకీర్, షేక్ మహబూబ్‌బాషా, అష్ఫాక్ హుస్సేన్, ఇమాంబాషా, రుహుల్లా, వైద్యులు ప్రభాకర్‌రెడ్డి, సురేష్, పాతకోట శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



పేస్ విద్యాసంస్థను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

సాక్షి క్లాసిఫైడ్స్

SERIVCES

BUSINESS OFFER

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521

■ ద్వారక ఎంటర్‌ప్రైజెస్: పేపర్‌ప్లేట్స్ & LED బిజినెస్ పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం. ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం ✆ 9310515624, 8800496710

CHANGE OF NAME AND DOB

■ I, MUTHYALA SUBBAMMA, DATE OF BIRTH 15-08-1953 (OLD NAME AND DOB), R/O 2/331, MANGALIMITTA, RAJAMPET (T), (M), ANNAMAYYA (DT), AP, HEREBY CHANGED MY NAME AND DOB MUTHYALA VENKATA SUBBAMMA AND DATE OF BIRTH 15-08-1955 (NEW NAME AND DOB), W/O LATE SIVA RAMAIAH.

■ గుండ్లూరు గుల్నాజ్ బేగం (పాతపేరు) భర్త జి.ఎస్.నూర్ ఐ ఆజం, ఇ.నెం: 6-171-A, గుండ్లూరు వీధి, మదనపల్లి, అన్నమయ్య జిల్లా,A.P. అను నేను ఇక నుండి నా పేరు గుండ్లూరు షేక్ గుల్నాజ్ బేగం (కొత్తపేరు)గా మార్పు చేయడమైనది.

■ గుండ్లూరు నూర్ ఆజం (పాతపేరు) తండ్రి జి.ఎస్.మౌలాన, ఇ.నెం: 6-171-A, గుండ్లూరు వీధి, మదనపల్లి, అన్నమయ్య జిల్లా, A.P. అను నేను ఇక నుండి నా పేరు గుండ్లూరు షేక్ నూర్ ఐ ఆజం (కొత్తపేరు) గా మార్పు చేయడమైనది.

WANTED

■ కడపలోని ప్రముఖ టూవీలర్ షోరూం నందు పని చేయుటకు టెలికాలర్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం.10వేలు. సంప్రదించండి. 9052729788, 9505536780

■ ఆల్ తెలుగు ప్రజాపార్టీకి కడప జిల్లాలోని పార్లమెంట్ & అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా అభ్యర్థులు కావలెను. రాజకీయాలపట్ల ఆసక్తి, న్యాయకత్వ లక్షణాలు కల్గిన వారు సంప్రదించండి : కడప అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి కుమార్‌స్వామి: 7899499023

■ కడప టౌన్ సమీపంలోని KK HERBAL MARKETING సంస్థ నందు పని చేయుటకు టెలికాలర్స్, FEMALE & MALE మరియు రెండు సంవత్సరాల కంప్యూటర్ అనుభవం కలిగిన టీమ్‌లీడర్స్ మరియు కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. (ONLY FEMALE) Contact : 9177922933, 8121841515, 9908943445

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఫోన్: 9160900024 / 9640400073.

■ తిరుపతి నందు ప్రముఖ సంస్థలలో కాంట్రాక్ట్ / అవుట్ సోర్సింగ్ పద్ధతి ద్వారా అటెండర్స్, సూపర్‌వైజర్స్,టెక్నీషియన్స్ జాబ్స్‌కలవు. Q:SSC to డిగ్రీ, Age:18 to 35 (SC,ST 45), Sal: 17,000 to 22,500,రూం సౌకర్యంకలదు. 96032 55559.

■ కడప జిల్లాలో కొత్తగా ప్రారంభించిన మా యాడ్ ఏజెన్సీ ఆఫీస్‌లో జాబ్ చేయుటకు 25 స్త్రీ/పులు కావలెను. జీ:14వేలు+DA 6వేలు+ఫ్రీ వసతి, నోఫీజు. అ:7th-డిగ్రీ, (P/F). కడప. సం.ప్ర: 95024 00350.

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడి సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, వాచ్‌మెన్‌లు, భార్యాభర్తలు కావలెను. ఫోన్: 8891098831, 9248585901.

■ మార్చి మొదటి వారంలో అమెరికా వెళుతున్న మాకు ఇంటి, వంట పనులు చేయుటకు ఆడమనిషి కావలెను. అమెరికా విజిటింగ్ వీసా కలిగిన వారు మాత్రమే సంప్రదించగలరు. ✆ 92904 15199

■ కామర్స్ లెక్చరర్, గణితం టీచర్, వార్డెన్, క్లర్క్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్, వంట మనిషి, ఆయా, వాచ్‌మెన్‌లు కావలెను. విద్యారంగం ఆసక్తి గలవారు సంప్ర: 9966006758

గమనిక

మాజీ వీసీ అప్పారావు పర్యటనపై విద్యార్థి సంఘాల అభ్యంతరం

వైవీయూ : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య పొదిలి అప్పారావు వైవీయూ పర్యటనను విద్యార్థి సంఘాలు వ్యతిరేకించాయి. బుధవారం వైవీయూలో నిర్వహించిన జాతీయ సైన్స్ వేడుకలకు ఆయన అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా రాయలసీమ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి మల్లెల జగదీష్ ఆయన రాకను వ్యతిరేకిస్తూ సమావేశ మందిరం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాదాస్పద మాజీ వీసీని వైవీయూ అధికారులు జాతీయ సైన్స్ వేడుకలకు పిలవడం బాధాకరమన్నారు. పరిశోధక విద్యార్థి రోహిత్ వేముల మృతికి కారకుడైన వ్యక్తిని సైన్స్‌డేకి పిలవడం ఏంటని ప్రశ్నించారు. అనంతరం ఆయన పాల్గొనే సెమినార్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వైవీయూలో నిర్వహించిన జాతీయ సైన్స్ వేడుకలకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య పి. అప్పారావును పిలవడం సరికాదని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న వేర్వేరు సమావేశాల్లో పేర్కొన్నారు. వివాదాస్పద వ్యక్తిని అతిథిగా పిలవడం ద్వారా విశ్వవిద్యాలయ పరువును మంటగలిపారని విమర్శించారు.

విద్యార్థిని ఆత్మహత్య



మృతురాలు గురులక్ష్మి

పోరుమామిళ్ల : పట్టణంలోని బలిజకోటవీధికి చెందిన మెరిమేకల గురులక్ష్మి(19) బుధవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆమె నాన్న గురప్ప ఏడెనిమిది సంవత్సరాల క్రితం మరణించడంతో తల్లి గురమ్మ కూలిపనులు చేసి బిడ్డలను పోషిస్తోంది. వారికి ఇద్దరు ఆడపిల్లలు కాగా మృతురాలు పెద్దది. గురులక్ష్మి పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. బంధువులు ఆమె అనారోగ్య కారణాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు చెబుతున్నారు. మృతురాలి చిన్నాన్న కుమారుని వివాహం బుధవారం హైదరాబాదులో జరుగుతుండటంతో అమ్మతో సహా బంధువులు అందరూ హైదరాబాదుకు వెళ్లారు. గురులక్ష్మి తన మేనత్త వద్ద ఉంటోంది. ఈ నేపథ్యంలో ఆమె ఆత్మహత్య చేసుకుంది. తన చావుకు ఎవరూ కారణం కాదని లెటర్ రాసి చనిపోయినట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పంపించామని, కేసు దర్యాప్తులో ఆత్మహత్యకు కారణం తెలియవచ్చని ఎస్ఐ చెప్పారు.

5 వంట గ్యాస్ సిలిండర్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సిలిండర్లతో విజిలెన్స్ అధికారులు

మైదుకూరు : పట్టణంలోని ప్రొద్దుటూరు రోడ్డులో బుధవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేసి ఓ హోటల్‌లో అక్రమంగా వినియోగిస్తున్న 5 గృహ వినియోగ వంట గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రొద్దుటూరు రోడ్డులోని శ్రీలక్ష్మి నరసింహా హోటల్‌లో నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న ఒక ఫుల్ సిలిండర్, 4 ఖాళీ సిలిండర్‌లను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హోటల్ యజమాని నరసింహయ్యపై 6(ఏ) కేసు నమోదు చేశారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఇదురు బాషా మాట్లాడుతూ హోటల్ యజమానులందరూ వారి వాణిజ్య కార్యకలాపాలకు కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను మాత్రమే విధిగా వాడాలన్నారు. మైదుకూరు ఆర్ఐ మహేంద్రనాథ్‌రెడ్డి, విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్ ఎస్.జనార్దన్ రావు, ఎం.కృష్ణా నాయక్ పాల్గొన్నారు.

రంగ రంగా.. వైభవంగా!

- కదిలింది బ్రహ్మారథం
- దారిపొడవునా గోవింద నామస్మరణలు, భజనలు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలో శ్రీరంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం శ్రీదేవి, భూదేవీ సమేత శ్రీరంగనాథ స్వామి రథోత్సవం కనుల పండువగా జరిగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు పట్టణ పరిధిలోని భక్తులతోపాటు వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి కాయ కర్పూరాలు సమర్పించుకున్నారు. స్వామి వారి తేరు (రథం) కింద గుమ్మడికాయలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పూజాద్రవ్యాలు సమర్పించారు. ఆ దేవదేవుని దర్శించి తరించారు. దారి పొడవునా గోవింద నామస్మరణలతో రథాన్ని కదిలించారు. భక్తి పారవశ్యంలో మునిగితేలారు. తేరు ప్రారంభానికి ముందు అర్చకుడు కృష్ణరాజేష్‌శర్మ విశేష పూజలు జరిపించారు. ఉభయదారులకు అర్చనలు చేశారు. తేరు ప్రారంభోత్సవ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, అంకాలమ్మ ఆలయ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, వివిధ శాఖల అధికారులతో స్వామి వారికి పూజలు జరిపించారు. మర్యాద పూర్వకంగా ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ రమణలు వారికి శాలువాతో సత్కరించి ప్రసాదాన్ని అందజేశారు. పూలంగళ్ల సర్కిల్‌లో ఆలయ చైర్మన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరునాల సందర్భంగా స్వామివారి రథం వెంబడి చెక్కభజన కళాకారులు భక్తిగీతాలను ఆలపిస్తూ వేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి.



రథంలో కొలువుతీరిన సతీసమేత శ్రీరంగనాథుడు

వైవీయూ టాపర్స్‌గా మైదుకూరు విద్యార్థులు



ఆర్.ఆయేషా



ఎస్.స్వరూప



ఎ.వసంత్

మైదుకూరు : యోగివేమన యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ 3, 4వ సెమిస్టర్ ఫలితాల్లో మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ టాపర్స్‌గా నిలిచారు. కళాశాల విద్యార్థులైన ఆర్.ఆయేషా బీఎస్సీ(బీజెడ్‌సీ) 3వ సెమిస్టర్‌లో 9.95 గ్రేడ్ సాధించి యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి బుధవారం తెలిపారు. అలాగే ఎ.స్వరూప(బీజెడ్‌సీ) 9.73 గ్రేడ్‌తో యూనివర్సిటీ స్థాయిలో ద్వితీయ స్థానం పొందిందని పేర్కొన్నారు. బీజెడ్‌సీ, బీఏ గ్రూప్‌లో తమ కళాశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. బీఎస్సీ ఎంపీసీ కంప్యూటర్ సైన్స్‌లో 9.12 గ్రేడ్‌తో ఎ.వసంత్ ఉత్తమ ఫలితాన్ని సాధించాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి కళాశాల కీర్తిని ఇనుమడింపజేశారన్నారు. విద్యార్థులను, అధ్యాపకులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ కృష్ణారెడ్డి, అయ్యవారురెడ్డి, రాధా రామ్, సుబ్బరాయుడు, నవనీశ్వర్ రెడ్డి, నరసింహారావు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం అలవరచుకోవాలి



ఎగ్జిబిట్స్‌ను పరిశీలిస్తున్న శేషాద్రి, సుబ్బలక్ష్మి సాయిరమేష్

కమలాపురం : ప్రతి ఒక్కరు విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవాలని నల్లింగాయపల్లెలోని భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్)లో ఉన్న డీఏవీ భారతి విద్యామందిర్ అడ్వైజర్ సుబ్బలక్ష్మి సాయిరమేష్, రీజనల్ ఆఫీసర్ శేషాద్రి తెలిపారు. శుక్రవారం నేషనల్ సైన్స్ డేను పురస్కరించుకుని స్కూల్ ప్రిన్సిపల్ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్స్‌ను వారు పరిశీలించారు. ప్రజల జీవనానికి అనుసంధానంగా ప్రాజెక్ట్ తయారు చేశారని విద్యార్థులను వారు ప్రశంసించారు. ముందుగా సర్ సీవీ రామన్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథం అలవరచుకోవాలన్నారు. నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలన్నారు. సాధన చేస్తే సాధించలేనిది ఏదీ లేదని, ప్రతి ఒక్కరు ఒక శాస్త్రవేత్తగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఎగ్జిబిట్స్ తయారు చేసిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పరిశ్రమ ప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.